EVENING EDITION

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
25 జులై 2024
పేజీలు: 02






## సెంచరీ కొట్టిన టమాటా

సామాన్యులకు 'టమాటా' చుక్కలు చూపిస్తోంది. కిలో ధర రూ.100 చేరువవ్వడంతో టమాటాకు టాటా చెప్పాల్సిన సమయం వచ్చిందంటున్నారు సామాన్యులు. రైతు బజార్లలోనూ నిర్ణయించిన ధరకు మించి విక్రయాలు సాగిస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో రూ.90 నుంచి రూ.100 వరకు విక్రయాలు సాగిస్తున్నారు.




## రూటు మార్చేస్తున్న జగన్!

ఏపీ ఎన్నికల ఫలితాల తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలు విపక్ష వైసీపీ అధినేత జగన్ ను అనివార్యంగా కూటమి వైపు నెట్టేస్తున్నాయి. ఐదేళ్లుగా మోడీతో జట్టు కట్టినా ఏపీలో మాత్రం పరిస్థితులు తారుమారు కాగానే బీజేపీ తనకు దూరంగా జరిగిపోవడంతో వచ్చే ఐదేళ్లలో ఏం జరగబోతోందో జగన్ ముందుగానే అంచనా వేసుకుంటున్నారు. దీంతో తన వ్యూహాలు మార్చుకునే పనిలో బిజీగా ఉన్నారు. ఢిల్లీ ధర్నాలో అనూహ్యంగా లభించిన ఇండీ కూటమి మద్దతు ఇప్పుడు జగన్ ఆలోచనల్ని మార్చేసేలా కనిపిస్తోంది.

## జ్యోతి యర్రాజీ గురించి తెలుసా?

విశాఖకు చెందిన జ్యోతి తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డు. తల్లి ఆస్పత్రి, ఇళ్లల్లో పనులు చేస్తుంటారు. 1999లో జన్మించిన జ్యోతి.. 24 ఏళ్లకే 100 మీటర్ల హార్డిల్స్‌లో నేషనల్ రికార్డులను బద్దలుకొట్టారు. గతేడాది ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఇప్పటివరకు 3 సార్లు నేషనల్ ఛాంపియన్‌గా నిలిచారు. వరల్డ్ ర్యాంకింగ్ కోటాలో పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు చేసుకున్నారు.






## నీటి పారుదల శాఖకి ఈ బడ్జెట్ లో 22,301 కోట్లు

గత ప్రభుత్వం చివరి దశ నిర్మాణలలో ఉన్న చాలా ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించింది. దీనివల్ల, ఎంతో ప్రజాధనం ఖర్చు అయ్యి కూడా ప్రజా అవసరాలను తీర్చడానికి ఇవి వినియోగంలోకి రాలేదు. మా ప్రభుత్వం తుది దశలో ఉన్న ఇలాంటి ప్రాజెక్టులను మరియు ఆయకట్టు తక్షణం పెంపొందించే 6 ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరంలో, మరియు 12 ప్రాజెక్టులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయడానికి నిర్ణయించాం. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న భారీ, మధ్యతరహా మరియు చిన్న ప్రాజెక్టుల నిర్వహణ కూడా గత పదేళ్లలో జరగకపోవడం వల్ల ఆ ప్రాజెక్టుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రజలకు మేలు జరుగలేదు. అవి అలాగే వదిలేస్తే మన జాతీయ సంపదగా భావించే ప్రాజెక్టులు నిరుపయోగం అవుతాయి. అందుకే మా ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణ మరియు మరమ్మత్తులను తగిన సమయంలో చేపట్టడానికి నిశ్చయించాము. నీటి పారుదల శాఖకి ఈ బడ్జెట్ లో 22,301 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

## నీటి పారుదల రంగం..

రాష్ట్రంలో ఈనాటి వరకు 34 భారీ, 39 మధ్యతరహా మొత్తం 73 నీటి పారుదల ప్రాజెక్టులను చేపట్టడం జరిగింది. వాటిలో 42 ప్రాజెక్టులను (10 భారీ మరియు 32 మధ్యతరహా) పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం 24 భారీ మరియు 7 మధ్యతరహా మొత్తం 31 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు, డిజైన్లలో లోపాలు, నాణ్యతా రహితంగా చేసిన నిర్మాణాలు ఆ ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసాయి. ఈ ప్రాజెక్టు గురించి చేసిన ఆర్భాట ప్రచారంతో రైతులు దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, కొద్దికాలంలోనే ఈ ప్రాజెక్టు యొక్క డొల్లతనం బయటపడి రాష్ట్రం అంతా దిగ్భ్రాంతికి గురయ్యింది. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను గుర్తించి తగిన చర్యలు సూచించేందుకు విచారణ కమిటీని నియమించాము. ఈ న్యాయ విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే ఖర్చుపెట్టిన వేల కోట్ల ప్రజా ధనం వృధా అవ్వకుండా ప్రాజెక్టును కాపాడడానికి National Dam Safety Authority వారి సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాము.



# తెలంగాణ బడ్జెట్

## అసెంబ్లీలో ప్రవేశపెట్టిన

# భట్టి విక్రమార్క

### తొలిసారి ప్రతిపక్షనేత హోదాలో సభకు మాజీ సీఎం కేసీఆర్

తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణ పూర్తి స్థాయి బడ్జెట్ రూ. 2,91,191 కోట్లు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా రాష్ట్ర తలసరి ఆదాయం, అప్పులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయం వంటి వివరాలను వెల్లడించారు. అలాగే, బడ్జెట్‌లో ఏ పథకానికి ఎంత నిధులు కేటాయించారు.. ఈ శాఖకు ఎన్ని నిధులు కేటాయించారనే వివరాలను బడ్జెట్ ప్రసంగంలో వివరించారు ఆర్థిక మంత్రి భట్టి. రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 33 రకాల సన్న వడ్లకు ఇది వర్తిస్తుందని అన్నారు. దీని ద్వారా వరి పంటను లాభసాటిగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. సన్న రకం వడ్లు పండించే రైతులకు ఆర్థిక ప్రయోజనంగా ఉంటుందన్నారు.

## తెలంగాణ బడ్జెట్ 2024-25 పూర్తి వివరాలివే..

తెలంగాణ పూర్తిస్థాయి బడ్జెట్ : రూ.2,91,191 కోట్లు

రెవెన్యూ వ్యయం - రూ.2,20,945 కోట్లు

మూలధన వ్యయం - రూ.33,487 కోట్లు

తెలంగాణ తలసరి ఆదాయం - రూ.3,47,299

తెలంగాణ ఏర్పాటు నాటికి అప్పు - రూ. 75,577 కోట్లు.

ఈ ఏడాది డిసెంబర్ నాటికి అప్పు - రూ. 6.71 లక్షల కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ. 42 వేల కోట్ల బకాయిలు చెల్లింపు.

వివిధ రంగాలకు కేటాయింపులు కోట్లలో..

వ్యవసాయం, అనుబంధ రంగాలకు- రూ. 72,659

హార్టికల్చర్ - రూ. 737

పశుసంవర్ధక శాఖ - రూ. 19,080

మహాలక్ష్మి ఉచిత రవాణా - రూ. 723

గృహజ్యోతి - రూ. 2,418

ప్రజాపంపిణీ వ్యవస్థ - రూ. 3,836

పంచాయతీ రాజ్ - రూ. 29,816

మహిళా శక్తి క్యాంటిన్ - రూ. 50

హైదరాబాద్ అభివృద్ధి- రూ. 10,000

జీహెచ్ఎంసీ - రూ. 3,000

హెచ్ఎండీఏ - రూ. 500

మెట్రో వాటర్ - రూ. 3,385

హైడ్రా - రూ. 200

ఏయిర్పోర్ట్‌కు మెట్రో - రూ. 100

ఓఆర్ఆర్ - రూ. 200

హైదరాబాద్ మెట్రో - రూ. 500

ఓల్డ్ సిటీ మెట్రో - రూ. 500

మూసీ అభివృద్ధి - రూ. 1,500

రీజినల్ రింగ్ రోడ్డు - రూ. 1,500

స్త్రీ, శిశు సంక్షేమం - రూ. 2,736

ఎస్సీ, ఎస్టీ సంక్షేమం - రూ. 17,000

మైనారిటీ సంక్షేమం - రూ. 3,000

బీసీ సంక్షేమం - రూ. 9,200

వైద్య ఆరోగ్యం - రూ. 11,468

విద్యుత్ - రూ. 16,410

అడవులు, పర్యావరణం - రూ. 1,064

ఐటి - రూ. 774

నీటి పారుదల - రూ. 22,301

విద్య - రూ. 21,292

హోంశాఖ - రూ. 9,564

ఆర్ అండ్ బి - రూ. 5,790

## రైతన్నలకు

### తెలంగాణ ప్రభుత్వం శుభవార్త..

## రూ. 500 బోనస్

రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 33 రకాల సన్న వడ్లకు ఇది వర్తిస్తుందని అన్నారు. దీని ద్వారా వరి పంటను లాభసాటిగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. సన్న రకం వడ్లు పండించే రైతులకు ఆర్థిక ప్రయోజనంగా ఉంటుందన్నారు. ఇక భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూమి లేని రైతు కూలీలు ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయారని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో వాళ్లందరికీ భరోసా ఇవ్వనుందన్ని చెప్పుకొచ్చారు.



## తెలంగాణ అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్ హాజరు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీకి హాజరయ్యారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా విపక్ష నేతగా తొలిసారి సభకు వచ్చారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలి సీఎంగా పగ్గాలు చేపట్టిన కేసీఆర్.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి విపక్షానికి పరిమితమైంది. దీంతో కేసీఆర్ ప్రతిపక్ష నేత స్థానంలో కూర్చుకున్నారు. హైదరాబాద్ నందినగర్ నుంచి అసెంబ్లీకి బయలుదేరుతుండగా కేసీఆర్ వాహనానికి దిష్టితీశారు. తన నివాసం దగ్గర నుంచి బయలుదేరుతుండగా అభిమానులు గుమ్మడికాయ కొట్టారు. అయితే ఈ నెల 23 నుంచి మొదలైన అసెంబ్లీ సమావేశాలకు కూడా కేసీఆర్ గైర్హాజరయ్యారు. కానీ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు కావడంతో కేసీఆర్ ఖచ్చితంగా వస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. అసలు కేసీఆర్ సమావేశాలకు హాజరు అవుతారా?... లేదా? అనే దానిపై నిన్న మొన్నటి వరకు సందిగ్ధత నెలకొంది. చివరకు అనుకున్న విధంగానే కేసీఆర్ నేడు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.

## రైతులకు గుడ్‌న్యూస్.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి

# బడ్జెట్‌లో భారీ కేటాయింపులు..

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో తెలంగాణ రైతాంగం ఎంతో నష్టపోయిందని.. రైతు సాధికారత దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని తక్కువ కాలంలోనే నిరూపించామని భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తెలిపారు. వివిధ రంగాలకు కేటాయింపులను ఆయన సభలో వివరించారు. మొత్తంగా రూ.2, 91, 191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

**రైతులకు గుడ్ న్యూస్..**

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యానవన పంటలకు ప్రోత్సహం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నకిలీ విత్తనాల కారణంగా రైతాంగం నష్టపోయిందని.. తమ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క సభలో ప్రకటించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతు దిగుబడిని పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్నాలజీని వ్యవసాయానికి అనుసంధానిచడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పూటగడవని నిరుపేదలకు గూడు సమకూర్చడం ప్రభుత్వ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఎన్నో ఆశలు కల్పించి.. ఇళ్లు కేటాయించకుండా దగా చేసిందన్నారు. పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించామన్నారు. పేద ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని భట్టి విక్రమార్క తెలిపారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కంగనా రనౌత్‌కు హైకోర్టు నోటీసులు


బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. స్వతంత్ర అభ్యర్థిగా తాను దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారని మండికి చెందిన లాయక్ రామ్ నేగి పిటిషన్ వేశారు. అందులో కంగనా ఎన్నికను సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు దీనిపై ఆగస్టు 21లోగా బదులు ఇవ్వాలని కంగనాకు నోటీసులు ఇచ్చింది.

## నాడు కేసీఆర్.. నేడు రేవంత్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందుకు నిరసనగా ఈనెల 27న జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. అయితే తెలంగాణ సీఎం ఇలా చేయడం ఇది రెండోసారి. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు నిధులివ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సులను గతంలో కేంద్రం పట్టించుకోలేదు. దీంతో 2022లో అప్పటి సీఎం కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు.

## ట్యూషన్ టీచర్‌తో ప్రేమ.. ఆన్‌లైన్ ఆర్డర్లతో వేధింపులు!

చెన్నైలో ట్యూషన్ టీచర్(22)తో ప్రేమలో పడ్డాడు ఓ మైనరు(17). ఇటీవల ఆమె అతణ్ని దూరం పెట్టడంతో పగ పెంచుకుని వినూత్న రీతిలో వేధించడం మొదలుపెట్టాడు. ఆమె ఇంటికి వందలాది క్యాష్ ఆన్ డెలివరీ ఆర్డర్లు, ఓలా, ఉబర్ రైడ్స్ బుక్ చేశాడు. వచ్చిన వారికి సమాధానం చెప్పకోలేక యువతి కుటుంబం ఉక్కిరిబిక్కిరైంది. దీనిపై వారు పోలీసులను ఆశ్రయించగా నిందితుడ్ని పట్టుకున్నారు. అతనికి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.



# వానలే వానలు..

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలర్ట్..

రెండు తెలుగు రాష్ట్రాల్లో గత రెండు రోజులుగా వర్షాలు జోరందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ వర్షాలు మరో మూడు రోజులపాటు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అధికారులు అలర్ట్ అయ్యారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు విస్తృతంగా కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

తెలంగాణ ఈ ప్రాంతాల్లో..

తెలంగాణలో గురువారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ఏం.మల్కాజ్ గిరి, ములుగు, నాగర్ కర్నూల్, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, హన్మకొండ, భువనగిరి జిల్లాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కాగా భూపాలపల్లి, కరీంనగర్, కుమరం భీమ్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల మేర ఈదురు గాలులతో మోస్తరు వర్ష సూచన ఉందని తెలిపారు. ఇక హైదారబాద్ విషయానికొస్తే గురువారం నగరంలో ఆకాశం మేఘావృతమై ఉండి పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఏపీలోనూ వనాలే వనాలు..

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని, రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని అధికారులు తెలిపారు. కోస్తా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏలూరు, అల్లూరి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అల్లూరి జిల్లాలో గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీచే అవకాశాలు ఉన్నాయి. వచ్చే మూడు రోజుల్లో ఉత్తరకోస్తాలో అక్కడక్కడా మోస్తారు వర్షాలు.. దక్షిణ కోస్తాలో ఒకటి రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఇక ఉత్తరకొస్తా తీరం వెంబడి 45-65 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, మరో మూడు రోజులపాటు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.



## టెస్టు జట్టులోకి అర్ష్‌దీప్ సింగ్?

టీమ్ఇండియా లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆస్ట్రేలియాతో జరిగే టెస్ట్ సిరీస్‌లో ఆడించాలని సెలక్టర్లు భావిస్తున్నారట. టెస్టులకు సిద్ధం చేసేందుకు సెప్టెంబర్ 5 నుంచి జరిగే దులీప్ ట్రోఫీ, పలు దేశీయ రెడ్ బాల్ మ్యాచుల్లో అతడిని ఆడించాలని నిర్ణయించారట. గత 3, 4 ఏళ్లుగా ఐపీఎల్‌లో పంజాబ్ తరఫున, వైట్ బాల్ క్రికెట్‌లో ఇండియా తరఫున అర్ష్‌దీప్ రాణిస్తున్న సంగతి తెలిసిందే. టెస్టుల్లోనూ మెప్పిస్తారేమో వేచి చూడాలి.

## బికినీలో ఊయల ఊగుతున్న కృతి కర్బంద



రీసెంట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్న కృతి కర్బంద.. తాజాగా బీచ్‌లో ఎంజాయ్ చేస్తుంది. బీచ్‌కి తగ్గట్లు అవుట్ ఫిట్ వేసుకుని.. నీటిలో ఆడుకుంటూ ఫోటోలకు ఫోజులిచ్చింది. సన్‌లైట్‌లో బ్యాక్ పూర్తిగా ఇసుక, వాటర్‌తో నిండిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. అభిమానులు ఈ ఫోటోలకు చాలా అందంగా ఉన్నావంటూ కామెంట్లు పెడుతున్నారు. కృతికర్బంద, పుల్కిత్ సామ్రాట్ కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు. తాజాగా వీరిద్దరూ కుటుంబసభ్యుల సమక్షంలో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 2019 నుంచి ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారు. పుల్కిత్‌కి ఇది రెండోపెళ్లి. 2015లో ఆయన శ్వేతా రోహిరాను పెళ్లి చేసుకున్నారు. అదే సంవత్సరం ఆమెతో విడిపోయారు. కృతి తెలుగులో ఎన్నో సినిమాల్లో నటించింది. ఇప్పటికీ తీన్మార్ ముద్దుగుమ్మగా తెలుగు ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసింది.మిస్టర్ నూకయ్య, ఒంగోలు గిత్త, బ్రూస్‌లీ సినిమాల్లో నటించింది. తర్వాత పూర్తిగా బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపునే సంపాదించుకుంది.

## కొత్త తరానికి అవకాశం కల్పించడానికే.. తప్పుకున్నా



దేశాన్ని ఏకతాటిపై నిలపడానికి కొత్త తరానికి అవకాశం కల్పించడానికే తాను అధ్యక్ష రేసు నుంచి తప్పకున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. తర్వాత తరానికి బాధ్యతలను అప్పగించడమే మేలైన మార్గమని భావించినట్లు వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించిన తర్వాత ఆయన తొలిసారి ప్రసంగించారు. ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కంటే పదవులు ముఖ్యం కాదని చెప్పారు. యువ గళం వినిపించడానికి ఇదే సరైన సమయమని వెల్లడించారు. అమెరికా రాజకీయాల్లో స్పష్టమైన విభజన కనిపిస్తోందని.. దానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. నియంత, నిరంకుశుల కంటే కూడా దేశం గొప్పదంటూ పరోక్షంగా ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సమర్థురాలన్నారు. ఆమె అధ్యక్ష అభ్యర్థికి తగిన వ్యక్తి అని పునరుద్ఘాటించారు. డెమొక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా హారిస్ తగిన వ్యక్తి అని అన్నారు. అధ్యక్ష కార్యాలయాన్ని గౌరవిస్తానని చెప్పారు. అంతకంటే ఎక్కువగా దేశాన్ని ప్రేమిస్తున్నానని తెలిపారు. అమెరికా ప్రజలకు అధ్యక్షుడిగా పనిచేయడం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ప్రజలంతా ఏకం కావాలని చెప్పారు. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లో పార్టీని ఏకం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధ్యక్షుడిగా, అమెరికా భవిష్యత్తు కోసం రెండోసారి ప్రెసిడెంట్‌గా పోటీ చేసే సామర్థ్యం తనకు ఉందని నమ్ముతున్నాని చెప్పారు. కానీ ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఏది అడ్డురాకూడదని విశ్వాసం వ్యక్తం చేస్తున్నానని వెల్లడించారు.



## లారీని ఢీకొట్టిన బైక్..

### ముగ్గురు యువకులు దుర్మరణం

సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. కంది మండలం తునికిళ్ల తండా శివారులో నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి ఓ బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.మృతులను పుల్కల్ మండలం గంగోజీపేటకు చెందిన సందీప్, నవీన్, అభిషేక్‌గా గుర్తించారు. వారంతా కందిలోని అక్షయపాత్రలో విధులకు వెళ్తుండగా ప్రమాదం జరిగందని చెప్పారు.

## జూరాల ప్రాజెక్టు 42 గేట్లు ఎత్తివేత..

గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 42 గేట్లను ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ నుంచి 1.97 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో స్పిల్‌వే ద్వారా 1.69 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 24,201 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కుల చొప్పన నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు కాగా ప్రస్తుతం 316.71 మీటర్లకు నీరు చేరింది. అదేవిధంగా ప్రాజెక్టులో 9.65 టీఎంసీలకు గాను ప్రస్తుతం 6.23 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహారాష్ట్రలోని ఆల్మట్టి నుంచి 2.25 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోంది. ఉదయం 10.30 గంటలకు 2.50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

